"SWARAJYA DARSAN" Publications No. 5.

(The only National Penny Library in the Andhra Desa.)

ఓం

వందేమాతరం.

గాంధి: దేవుఁడే?

సీమదేశపు దొరగారైన డాక్టరు వాల్టరు వాల్షుగారు,

లండను.

"Krishna Pushkaram" Special Edition

అయిదవకూర్పు 1000 ప్రతులు.

EDITOR:

D. V. Subba Row.

1933.

REPRINT]

గాంధి: దేవుడే?

"ఉత్తమ జీవితతత్త్వవేత్త"

డాక్టరు వాల్టరు వాల్షుగారు
స్టైయినువే హాలు, లండను.

కారాగృహము నిష్ప్రయోజక మని యిటీవల జి. వి. షాగారు నుడివినవాక్యమువలన మనకు నమ్మకము కలిగినది. పాతకముల నొనరించినవారినే కారాగృహము సంస్కరింపజాలనిచో భరతఖండకారాగృహమునం దారువత్సరములు నివసించునట్లు శిక్షవిధింపబడిన గాంధిమహాత్ముని అనురాగవిరహితభావమును తొలగించుటకు కారాగృహవాసము కేవలము నిష్ఫలమే కదా? భరతఖండమునందలి కారాగృహవాససౌకర్యము లెట్టివో నే నెరుంగనుగాని యిటీవల రైలుబండిలో బలవన్మరణమునకు పాలుపడిన 60 మందిమాపలాలవృత్తాంతమును తలంచుకొనినచో కారాగృహము లారోగ్యస్థానముల వలె నదుపాయకరములు కావని మనము నిర్ణయింపవచ్చును.
...మునం దిపు డాసేతుశీతనగపర్యంతమును స్త్రీబాల
...గడ తేరిన జాతీయవాద నాయకులనుగొప్పకుటుం

TPLA107B160
24 1

బములనారీమణులను నవయౌవనులగు దేశభక్తులను ముక్కుపచ్చలారని చిరుతలను (ఇటీవల శిక్షింపబడిన గాంధి మహాత్ముని కడసారపు కుమారునివంటి వారిని) గూడ కారాగృహాములకు పంపుచుండుటచే నిపు డా దేశమున కారాగృహములన్నియు జనసంకులములుగా నుండవలెను. మన కనులయెదుటనే నూతనభారతాఖ్యాన మిటుల వ్రాయబడుచున్నది.

"ఎచట మనుష్యు డుండునో అచట విప్లవము గూడ నుండు"నని తన సుప్రసిద్ధమగు డివినిటీ పాఠశాలోపన్యాసమునందు ఎమర్సను నుడివెను. తప్పుసృష్టి (ఫోర్జరీ) చేయువారికిని దొంగలకును, భార్యలను కొట్టువారికిని ఎట్టిశిక్ష వేయుదురో అట్టిశిక్షనే ప్రభుత్వమువారిచే పొందిన ఈ గాంధి ఎట్టివాడో మనము తెలియదగును. అతనిగూర్చి నాకెందరో పాశ్చాత్యులును భారతీయులును గూడ వ్రాసిరి. వానిలో సత్యములు అసత్యములు, సత్యాసత్యములు మున్నగున వన్నియును కలగలుపుగా నున్నవి. వానిని సరిపోల్చి నా యభిప్రాయప్రకారము చాలవరకు సత్యమని తోచినవృత్తాంతమును సంపాదన మొనరించి దానిని మీ కెఱింగించుచున్నాను.

ఇపుడు సజీవులుగనున్న సుప్రసిద్ధులగు వారిలో ముగ్గురి పేర్లను మనము ప్రత్యేకింప దలచినచో ప్రకృతి శాస్త్రవేత్తయగు ప్రొఫెసరు బోసు (కలకత్తా) గారిని వాఙ్మయమున రవీంద్రనాథ టాగోరుగారిని కర్మవీరుడగు గాంధిమహాత్ముని పేర్కొనవలసియుండును. వీరు ముగ్గురును భారతీయులే. ప్రాచీన

పరికల్పనములు శిథిలమగు చున్నపుడు నూతనపరికరముల నెలకొల్పుటకు మహామేధావు లతిదీర్ఘ కాలసంధులం దపుడపు డవతరించుచుందురు. గాంధిమహాత్ము డట్టివాడని నేను నమ్ము చున్నాను. అట్టివా డవతరించుటతోడనే విప్లవముకూడ పొడ చూపును. "మహనీయులను సృష్టింపుము. తక్కినవన్నియు సుల భముగ చేకూరగలవను" సిద్ధాంతమును గూర్చి విటుమనుగూడ ఎమర్సనుతో నేకీభవించెను. ఇపుడు భరతఖండమునం దటులనే (మహాత్ముడు పూనుకొనినంతనే) సర్వమును కడు శీఘ్రముగా సమకూడుచున్నది. విప్లవమును ప్రబల జేయుటకు ప్రభుత్వ మువారు నిర్బంధవిధానమే అవశిష్టము. భరతఖండము నందలి మనప్రతినిధులు (ప్రభుత్వమువారు) దానినిగూడ శ్రేష్ఠ ముగ సమకూర్చు చున్నారు. పరిపాలకులగు వారికిమార్గాంత రము లేకుండుటయు సత్యమే కావచ్చును. అటులైన దేశీయుల కంగీకారము లేనపుడు వా రా దేశపరిపాలనము నేల విడువ రాదను ప్రశ్న కలుగును.

భారతీయుల ఆశయమును విదిత మొనరించుట

ఉదారభావుడగు నా సంస్కర్తను కారాగృహమున బంధించుటవలన ప్రాచ్యదేశీయమగు శ్రేష్ఠతమశక్తిని నిరో ధింపగలుగుదుమని ప్రభుత్వమువా రాశించుచున్నారు. ఆమ హాచ్ఛక్తియొక్క భౌతికస్వరూపమునాయకునియం దున్నదిగాన దానిని వారుబంధింపగలుగుదురుగాని దేశీయు లందరియందు నమూర్తిమంతముగానున్న యాశక్తినిమాత్రము వారుబంధింప

జాలరు. గాంధి మహాత్ముడు భగవదవతారమని భారతీయులు తలంచుచున్నారనిన భారతీయుల ఆశయము గాంధి స్వరూపమున ప్రపంచమునకు గోచరించుచున్నదని మనము గ్రహింపదగును. గాంధి మహాత్ముని కంటె నధికస్వార్థత్యాగియు, అధిక వినయసంపన్నుడును మానవజాతికొరకు పవిత్రతమమగు త్యాగము నొనర్చినవాడును మరియొక డెవ్వడును ప్రపంచచరిత్రయం దెచ్చటను గూడ నాకు గోచరించుటలేదు. సత్త్వధనులగు యోగు లందరునుగూడ తమయందుగల మహిమను కొంచెమైన గుర్తింపజాలకుందురు. గాంధి మహాత్ముడుగూడ నటులే తానసమర్థుడనని తలపోయుచుండును. మానవాతిరిక్తమగు పరిశుద్ధతను పవిత్రతను గలవాడయ్యును తనయందు సుగుణసంపద సమగ్రముగ లేదని వగచుచుండును. భరతఖండము స్వాతంత్ర్యమును బడయగలదను ఘనాశయే తన్ను జీవింపజేయుచున్నదని నుడువుచుండును. ఆతనిజీవాత్మ పరమాత్మయందు లీనమైయున్నదిగాన మానవు డనిన నతనికణుమాత్రమును భీతిలేదు. భరతఖండవాసు లెందరో యికముందు దేశహితార్థము జీవితముల సమర్పింప వలసియుండుటచే త్యాగదార్ఢ్యరాహిత్యాశయములనే స్థిరముగ నమ్మియుండక ఖడ్గసిద్ధాంతము నాదరింతురేమో అని మాత్రమే మహాత్ముడు భీతిల్లుచుండును. అట్లు జరిగినచో భారతీయుడగు నాతని జీవితఫలిత మంతటితోనే తీరిపోవును. కాన నత డపుడు మహారణ్యములకేగి తనయొక్కయు దేశీయులయొక్కయు

దుశ్చరితమునకు ప్రాయశ్చిత్తముగ నచట తపోపవాస ప్రార్థనాదుల నొనరించుచుండును. ఇట్టి దివ్యాత్మనుగల మహాత్మునితో ప్రపంచమునందలి సామ్రాజ్యములు, మహారాష్ట్రములు, ప్రధానవర్గములును ప్రతిఘటించుట నిష్ప్రయోజనము.

—* అభివృద్ధినే నిరోధించుట *—

సాధుపుంగవుడును వీరవరేణ్యుడు నగు గాంధిమహాత్ముడు మూర్తిమంతమగు అభివృద్ధియని మన మంగీకరించు యెడల నతని కారాగృహమున బంధించుటచే బ్రిటిషుయుద్యోగులు అభివృద్ధిని సంస్కరణములనుగూడ నిరోధించి రనుట నిశ్చయము. ఇటీవల నీచర్య క్రొత్తవిషయముగాదు. కష్టముల ననుభవించుచుండియు మానవప్రీతులైయున్న కోట్లకొలది భారతీయుల దురవస్థను తగ్గింపగలుగుదు నను నాశవలననే తాను పోషింపబడుచున్నానని మహాత్ముడు నుడివెను. ఇపుడు భరతఖండమునందు ప్రబలిన యీ సంస్కరణ మొకమహాత్మునివలననే కలిగె నని యూహింపబోకుడు. మలినమును తొలగించు మహాతరంగమువలె నాయుద్యమ మా విశాలదేశమునందు తీవ్రముగ వ్యాపించి నూతనదేశభక్తులను నూతనాశయములను వెలికి దెచ్చుచున్నది. మద్యవిక్రయము నడంచుట, అస్పృశ్యులనంబడుచు నీచముగ చూడబడుచున్న సంఘమువారి నుద్ధరించు రూపమున వర్ణవివక్షతను తొలగించుట, రాట్నమును సాధనముగా కొని దారిద్ర్యమును తొలగించుట, హిందువులకు మహమ్మదీయులకు గల విరోధమును నిర్మూలించుట-

వీటి నన్నిటిని కేవలము దౌర్జన్య విరహితములును నిష్కళంక ములునగు పవిత్రాయుధములచేతనే సాధించుట మున్నగు రూపములచే నాయుద్యమము వ్యాపించుచున్నది. ఆయుద్యమ మునకు దౌర్జన్యరాహిత్యమే ప్రాణప్రదము. ఈసంస్కరణము భరతఖండమునందు సఫలమగునేని జర్మనీలో మార్టిను లూథరు చేసిన సంస్కరణమువలన కలిగినమేలుకంటెగూడ నధికమగు మేలు మానవసంఘమునకు చేకూరగలదు. ఏలనన దీనితత్వము నిరుపమానము; సూక్ష్మతమము. ఫలిత మతివిశా లము. అత్యంతభూతహితకరము. అయ్యది ఉన్నతమగుమానవ వికాసమువలన జనించినది. తీవ్రసమరప్రకోపనమహాశక్తుల నన్నిటి నతిక్రమించి గాంధిమహాత్ముని దివ్యమూర్తి విస్పష్ట ముగ నూతనసందేశముం గొనివచ్చిన దేవదూతవలె గోచ రించుచు భరతఖండమునకు కడుప్రాచీనమగు శాంతిసద్భావ సిద్ధాంతమును నూతనపరిస్థితుల కనుగుణముగ భరతఖండము నకు (ప్రపంచమునకు) వర్తింపజేయుచున్నది. ఆత్మానుభవము నకును నైతికస్వాతంత్ర్యమునకును, వ్యక్తులకువలె జాతు లకుగూడ అత్యంతమావధివరకును ప్రతిఘటనపరిత్యాగ మొక్కటియే ఆధ్యాత్మికవిశ్వాసహితమగు నుత్తమసాధ నము. భారతీయుల స్వాతంత్ర్యమునకు మాత్రమే కాక మానవ స్వాతంత్ర్యముకొరకే, స్వాతంత్ర్య హక్కులకొరకును, ఆత్మ ప్రకాశము, స్వయంనిర్ణయము, వాక్స్వాతంత్ర్యము, సంఘ స్వాతంత్ర్యము; బహిరంగ న్యాయవిచారణ, ప్రభుత్వవిధాన

మును న్యాయముగ సాగించుట, నైతికాశయనిరూపణము మున్నగు ప్రియతమోత్తమస్వాతంత్ర్యమము లన్నిటికొరకును గాంధిమహాత్ముడు సామ్రాజ్యసైనికసంఘర్షణమహాశక్తుల నన్నిటిని అపారశక్తుల నన్నిటిని ఇంతకుపూర్వ మేసంస్కర్త వలనను ఎన్నడును కలుగని అపూర్వజనానుమోదముతో ప్రతిఘటించుచున్నాడు. భయవిరహితుడగు నీసాధువరేణ్యుడు ఖడ్గఖేటకవిరహితుడు కేవలసత్యవాజ్మాత్రసహాయుడునై అసీసి ఫ్రాన్సిను సెయింటునుగూడ ఈర్ష్యాకులుని చేయజాలుసంతటి మాతృదేశసమర్పిత వ్యక్తిమహిమాసంజనిత అప్రతిమాన ప్రజాశక్తిసముపేతుడై ప్రతిఘటించుచున్నాడు. ప్రధాన స్వభావమునందు గాక గంభీరతయందు ప్రస్తుత పరిస్థితి నిరుపమానముగ నున్నది. దీనిముందట గోలియతును డెవిడు ప్రతిఘటించినవృత్తాంతము నీచోపమమే యగును. ఇది కేవలము భరతఖండవిషయమేగాక ప్రపంచవిషయమే యని నేను తలంచుచున్నాను. ప్రపంచ స్వాతంత్ర్యమును సైనికులపీడనము నుండియేగాక అంతకంటె ముఖ్యతమ మగు స్వీయదౌష్ట్యాచరణమునుండిగూడ నుద్ధరింపగల యీ విజయము భరతఖండమున చేకూరవలసినట్లున్నది.

—* మహాత్ముని విచారణ *—

మహాత్ముని విచారణవాదము శిక్ష మున్నగువిషయములనుగూర్చి పూర్తివృత్తాంతమును తెలిసికొనుటకు నే నొకవిదేశపత్రికను చదివినగాని గతికలుగలేదు. తనకు బ్రిటిషు ప్రభుత్వ

ముపై ననురాగము లేదనియును న్యాయాధిపతి తనకు ప్రతి కూలముగ తీర్పు చెప్పకతీర దనియు, న్యాయవాదియగు మహాత్ము డత్యంతవినయముతో విన్నవించెను. న్యాయాధిపతి గూడ మహాత్మునిపట్ల నత్యంతవినయమును చూపెనని చెప్పక తప్పదు. తన కత్యంతసంతాపకర మైనను అది తనవిధి యగు టచే దానిని నెఱవేర్పక తప్ప దనుభావముతో న్యాయాధిపతి తనకృత్యమును నెఱవేర్చెను. ఇట్టి దృశ్యమును స్మరించుటకు 2000 ఏండ్లు వెనుకకు పోకతీరదు. అప్పుడుగూడ రోమను పైలేటు తనవిధిని అసమ్మతితోను, సంతాపముతోను నెఱవే ర్చెను. అవకాశ మున్న తా నాజోక్యమును పూర్తిగా వదలు కొనియుండును. ఒక నేరముననే ఆయూదునిపైనను నీ భారతీయునిపైనను గూడ కేసు చేయబడెను. అపుడు వారు ఏసును పైలేటునొద్దకు తీసుకొనిపోయిరి "వీడు జాతికి దుర్బో ధనలు చేయుచుండగా మేము చూచితిమి. సీజరుకు కప్పము చెల్లించవద్దని వీడు బోధించుచుండును." అని వా రాతనిపై నేరములుచెప్పిరి. ఆతడు ప్రజలలో నుద్రేకమును కలిగించె నని వారికి మరింత ఆగ్రహము కలిగినది." (అని బైబిలులో నున్నది.) ఈ యుపమానము గాంధిని సమర్థింపనైన వలెను, ఏసును నిరసింపనైన వలెను. దీనిని ఖండింపజాలు న్యాయ శాస్త్రవేత్తలు క్రైస్తవప్రపంచమునం దెవరైన నున్న ఖం డింతురుగాక యని నేను సన్నిదము చరచుచున్నాను.

—* ఉత్తమ జీవిత తత్వవేత్త *—

ఆ నాజరీరును నీభారతీయుడునుగూడ ఆధ్యాత్మికోపదేశకులేమైనను వారిద్దరునుగూడ నిర్విచారముగ రాజకీయ దుష్టవాతావరణమున చొరబడిరి. నేను పెక్కుసారులు మీ కెరిగించినరీతినొకమతముపవిత్రతమమైనకొలది పర్యవసానమందు దౌర్జన్యపరుల కది పరమవినాశమే యగును. ప్రజాపీడకులు దానిని బాగుగా నెఱుంగుదురుగాన మతసంస్కర్తనినుపబోనునందు బంధించుటయో ఉరికంబముపై కెక్కించుటయో జరుగునంతవరకును వారు విశ్రమింపజాలరు. రాజకీయములు సామాన్యరాజ్యాంగవేత్తకు వినోదలేఖనమువలె నుండునుగాని ఏసు, గాంధిమహాత్ములవంటి ఆధ్యాత్మికవేత్తలకు అమూల్యముగను, ఆధ్యాత్మికోజ్జీవనమునకు నైతికపునర్వికాసమునకును కుటుంబసౌజన్యసౌశీల్యాభివృద్ధికిని గలఅభ్యంతరములను తొలగింపదగినసాధనముగను కనంబడును. వారు దేశీయులబహిరంగ రాజకీయవిధానమును పరిశుద్ధమొనరించుటకు ప్రయత్నింతురు. రాజకీయములందు తమ్ముప్రతిఘటించు రాజ్యాంగవేత్తలనందరి నతిక్రమించి మిన్నలై ఉత్తమజీవితతత్వవేత్తలై ప్రకాశించెదరు. జనరలుబూతును జనరలుసాకుతో మనమెట్లుపోల్చజాలమో! అటులే గాంధిమహాత్ముని సామాన్యయుద్ధవీరులును దేశభక్తులునగు ఆలివరుక్రాంవెలు స్పార్టకను మున్నగువారితో పోల్చజాలము. ఆతనిసందేశము దివ్యవాక్కుగాని సమయాను

1938

గుణ్యమగుపద్ధతి కాదు. ఆత డవలంబించినదౌర్జన్యరాహిత్య సాధనమే ఆత్మశిక్షణసాధనములలో నగ్రగణ్యము. భారతీయులు ఉన్నతోన్నతఫలితమును బడయుటకు తగిన త్యాగమార్గమువలనసామాన్యజనసంఘమునందు మానవజీవితమును పూర్తిగా వృద్ధినొందింప నవకాశము కలదని ఆతేడు గుర్తించెను. పాశ్చాత్య నాగరకత ఎంతవరకు మానవనీతిని నిరోధించునో అంతవరకే ఆతడా నాగరకతను నిరసించును.

—• మహాత్ముడు ప్రకృతిచే విప్లవప్రియుడు కాడు •—

కాన గాంధిమహాత్ముడు కేవలము వినాశనమే వినోదముగాగల మూఢోన్మాదియును ప్రకృతిచేతనే విప్లవప్రియుడును అను ననుమానమును మనము తొలగించితిమి. విప్లవవినాశనాసక్తులకును మూఢులగు నున్మాదులకును మహాత్మునకు గల నిష్కల్మషాత్మ యుండ నేరదు. భరతఖండవాసులకు తటస్థించిన నైతిక దురవస్థను తిలకించుటచేతనే పాశ్చాత్య నాగరికతాభిమానిగా నుండిన మహాత్ము డద్దానికి ప్రబలవైరిగ క్రోధవిరహితుడుగ పగతుడుగ మారిపోయెను. భారతీయులదురవస్థయే ఆతనియందీమార్పును కలిగించినది. పరాధీనతకు పాల్పడిన జాతివారు విజేతయగు విదేశీయుని అనుగ్రహమును బడయుటకు కాపట్యమునకు పాల్పడుట సహజము. భారతీయులందే పరాధీనత బానిసత్వలక్షణమును కాపట్యమును కలుగజేయుచున్నందులకే మహాత్ము డత్యంతచింతాకులుడయ్యెను. మహాత్ముడసాధ్య ప్రతిస్పర్థియని ఆతని దీర్ఘలంబదృఢకాయమును

బట్టి ప్రతిపక్షులు తలంచుటలేదు. తపోభారకృశమగు నాతని మూర్తి 100 పౌనులు మాత్రమె బరువుండును. నూతన సంప్రాప్త యౌవనయగు పడతుక కంటెనుగూడ నాతడు లఘుకాయుడు. ఇట్టివాడు యోధాగ్రణుల కెల్లనాయకత్వమునువహింపగలిగెనను శంకవొడమక మానదు. కోట్లకొలందులగు భారతీయుల కద్భుతోత్సాహమును కలిగించి వారిచే దైవసమానుడని అత డర్చింపబడుట కాతని మేధాశక్తిగూడ కారణముకాదు. కేవల మేధాసంపదనే విచారింతుమేని రష్యాదేశపు విప్లవనాయకులకు గాంధిమహాత్ము డీడుగాడు. గాని నైతికమహాశక్తి సంపదయందు రష్యానాయకులు గాంధమహాత్ముని పాదసన్నిధిని నిలుచుటకైన సర్వులుకారు. అతని అనుచరులను వీరసులభోత్సాహముతో కార్యపరతంత్రులగునట్లు చేయజాలిన దాతని దీర్ఘగంభీర వాగ్ఘరీవిశేషముగూడగాదు. ఆతని ప్రసంగము శాంతముగను, మితముగను, సహేతుకముగ నుండును. ఆతడు నిరంతరము త్యాగమునకు పురికొల్పునే గాని విజయమునకుగాదు. ఆతడంతరాత్మకును మానవునియందలి దైవస్వరూపములకు నుత్తేజమును కలిగించునట్లుమాత్రమే ప్రసంగించుచుండును. ఆతడు కష్టానుభవమునకు పురికొల్పునుగాని శత్రుసంహారమునకుగాదు. నిజముగా ప్రపంచమునం దీత డపూర్వ విప్లవకారుడు! దీని రహస్యమేమి? ఆతనియుద్దేశము లందలి సమగ్రపవిత్రభావము, ఆతనిప్రవర్తనములందలి నిష్కాపట్యము, అపారమగు నాతనిభూతదయ, దైవత్వమ్మునకు భారతీయ

నిర్ణేతలక్షణమగు ననంతస్వార్థపరిత్యాగము, సర్వప్రాణులపై నపారప్రేమ, నీచతమప్రాణులనుగూడ నాలింగన మొనరింప కొంకని జీవకారుణ్యము మున్నగు సుగుణముల కాత డాట పట్టగుటయందే యీరహస్యమంతయును కలదు. న్యాయవాద వృత్తియం దగ్రస్థానమునుబడసి అధికైశ్వర్యవంతుడై నగాంధి మహాత్ముడు పంచమాదినిమ్నజాతులతో సమానమగు నీచతమస్థానము వరించెను. సకలభోగముల నవలీల త్యజించెను. సంపదలనెల్ల దిగనాడెను. మానవహితార్థము సమగ్రత్యాగము నొనరించెను. ఇట్టివారినే భారతీయులు దైవసము లని నిర్ణయించెదరు. మరి పాశ్చాత్యులన్ననో స్వర్ణగోవత్సమునకును రాజదండనమునకును యోధఖడ్గమునకును వినతు లయ్యెదరు.

—♦ భారతీయులు స్వయంనిర్ణయమును కోరుచున్నారు ♦—

ప్రపంచమునందలి జనసంఖ్యలో నైదవవంతువారగు భారతీయులకుగల ఏయిబ్బందులవలన నిట్టి అపూర్వస్థితులు భరతఖండమున నేర్పడెనో వానినిగూర్చి నేనీసందర్భమునకొంత వివరింపగోరెదను. ఆంగ్లేయులు ఖడ్గసహాయమున భరతఖండ మునుజయించుటయు నిప్పటికిని ఖడ్గసహాయముననే ఆదేశము నందలి సర్వసంపదల చూరగొనుచుండుటయును దీనికి ప్రధాన కారణములు. నవీన ప్రజాశక్తికి విదేశీయాక్రమణము విరుద్ధ మని తలపబడుచున్నది. యథార్థమగు ప్రజాసంఘముచే సార్వ జనీనముగ వివరింపబడిన స్వయంనిర్ణయస్వాతంత్ర్యమును నవ

శక్తి ప్రకటించుచున్నది. ఒకదేశమునందలిప్రజల అంగీకారము లేనపుడు విదేశీయు లెవరును గూడ ఆదేశమును పరిపాలింప దగినవారు కారను విషయమును మరచి విదేశ పాలిత దేశవాసులకు పదింబదిగ స్వరాజ్యమును వాగ్దానము చేయు చుండునేగాని దాని నొసంగకయే కాలయాపనము చేయుచుం డును. ఇటీవల టర్కీతో యుద్ధము నింకను సాగించుచుండుట వలన భారతీయుల కాగ్రహము ప్రబలమైనది. బ్రిటిషు దేశపు ప్రధానమంత్రి జేసిన వాగ్దానములకు భిన్నముగా సెవర్సుసంధి జరుగుటవలన నాయాగ్రహము ప్రబలతరమైనది. కెనియా కాలనీ, తూర్పుఆఫ్రికాలోని పాశ్చాత్య లీర్ష్యాళువులై భార తీయులకు నష్టము కలిగించుచుండుటవలన నా యాగ్రహము ప్రబలతరమైనది. విశ్వవిద్యాలయ పరీక్షలందు భారతీయాది ప్రాగ్దేశముల విద్యార్థులు పాశ్చాత్యవిద్యార్థులలో శ్రేష్ఠులగు వారినిగూడ మించుచున్నారనువిషయమును భారతీయులఘనత మేధాశక్తిని మరచి పాశ్చాత్యదేశములవారు ప్రపంచమునం దంతటను శ్వేతవర్ణుల ఆధిక్యమునే మతసిద్ధాంతముగ నిర్ణయిం చుచున్నారనుట సత్యము. సామ్రాజ్యపాతకములు జగద్విదిత ములు. పాపప్రాయశ్చిత్తార్థము జగదీశ్వరునకు మొరపెట్టు చున్నవి. బ్రిటిషుసామ్రాజ్యముగూడ తక్కిన సామ్రాజ్యముల కంటె నధికపాతకముల చేయకపోయినను. ఇందులకు విలక్ష

ణముకాదు. సామ్రాజ్య పరిపాలనా విధానమును గూర్చి రైటరుచేసిన చిన్నపత్రికటన మొకటి వినుడు. "జాలకిలు జాతి వారిపై జరిగిన విమానముల దాడి చాల బాగుగా సఫల మైనది. 16 విమానములు వారిపై బాంబులను వేసెను. మర ఫిరంగిగుండ్లను వదలెను. జాలకీలు జాతివారిలో చాలమంది చనిపోయిరి. వారి పశువు లధికముగ మడిసెను. (ఈ వార్తా సంఘమువా రాజాతివారి స్త్రీల బిడ్డల మరణములను గూర్చి ఏమియును తెలుపకున్నను విమానములనుండి పడుచున్న బాంబులు స్త్రీలని బిడ్డలని విచక్షణ చూపజాలవని మనము బాగుగా నెరుగుదుము) విమానములు చాలవరకు నిరపాయ ముగా స్వస్థలము చేరెను" అని రైటరు తంతివార్త నిచ్చెను. ఇందులకు తోడు పారిశ్రామిక విత్తాపహారణము మార్పులేని పరిస్థితులలో నిరంతరము జరుగుచుండును. మరి సాంఘిక విభేదము, రాజకీయ సత్వరాహిత్యము, కాటకము, దుర్భర దారిద్ర్యము; తమకంటె సర్వవిధముల నధిక విజ్ఞానవంతు లును నాగరికత కలవారు నగు దేశీయులును ఉద్యోగులును వారి స్త్రీలును (ఎల్లవారునుగారు) చాలమంది అహంభావ ముతో నిరసించి అగౌరవించుట మున్నగు దుర్భర పరిస్థితు లెన్నియో కలవు. మొదట దూరదృష్టి లేక తాను స్వీకరిం చిన బిరుదమును రవీంద్రనాథ టాగోరుగారు బ్రిటీషుదేశపు రాజునకు మరల పారవేయుట కేమి కారణమో మనమే యూహింపవచ్చును. ఇపుడు పత్రికా స్వాతంత్ర్యము

వాక్స్వాతంత్ర్యము, సమావేశ స్వాతంత్ర్యమును గూడ నడచి వేయబడెను. ప్రజానాయకుల నందరిని కారాగృహములకు పంపిరి. జనసామాన్యము దౌర్జన్యమునకు గడంగునట్లు పురికొల్పుట, కధిక సౌకర్యము గల పరిస్థితు లింతకంటె నేమియు నుండవు. ప్రభుత్వమువారు తమ పశుబలమువలన సులభముగ దాని నడంచెదరు. ఆ రీతిగా గాంధిపై విశ్వాసమును నిర్మూలించెదరు. ఇంకను అధికముగ ప్రజా స్వాతంత్ర్యమును, భంగపరచుటకు వారి కవకాశము కలుగును. ఇపుడు హిందూదేశమునం దున్న మన ప్రతినిధులు (ప్రభుత్వము) యిట్టి నీచపద్ధతినే అవలంబించుచున్నారా?

మాన్లేప్రభువు అధికారమును వంగరాష్ట్ర విభజనమును జరిగినప్పటినుండియును బ్రిటీషు ఉదార (లిబరలు)పక్షమువారిపైన గూడ భారతీయులకు విశ్వాసము తొలగిపోయినది. ఇప్పటికే గూడ నుదారకక్షువారి పత్రికలు శ్వేతవర్ణుని భారమనియు భారతీయుల బాధ్యతలను బ్రిటీషువారు వహించుట యనియు నిరర్థకపు వ్రాతలు వ్రాయుచుండుటచే భారతీయులకు విశ్వాసము పూర్తిగా తొలగినది.

"శ్వేతవర్ణుని భారమును తలపెట్టుము. నీవు పద్యమునల్లుదువేని, నీజాతివారి దుష్కృత్యముల ప్రశంసింపుము. వానిని నీచతములుగ జేయ ప్రయత్నింపుము. పిమ్మట ప్రతివాక్యమును పవిత్రపదములతో నీ వలంకరింతువేని అసత్యప్రియులగు

వంచకులచే నిండిన ప్రపంచమునం దిట్టి వ్యాపారము లాభ కరమని గ్రహింపు" మని ఎర్నెస్టుక్రాస్బీ వ్రాసెను.

సామ్రాజ్యాంతర్గతమగు స్వపరిపాలనమునే భారతీయు లిదివరకు కోరిరి. భారతీయస్వాతంత్ర్యపరమావధి దానినిగూడ నతిక్రమించి యుండునా యని బ్రిటిషువారే ప్రశ్నింపసాగిరి.

పైని వివరింపబడినయిబ్బందులను తొలగించుటకు భారతీయులును వారి నాయకుడును ప్రారంభించిన సాధనములను గూర్చి నేను వివరించెదను. వెనుక బుద్ధుడు, లోట్సీ, ఏసు, టాలస్టాయి, క్వాకరులు, డకోబరులు, మరి పెక్కుమందియు నవలంబించిన సాధనమే యిపుడు భారతీయుల ప్రధానసాధనము. అనగా సాత్వికనిరోధము. దానినే దోరియో వెనుక ఆజ్ఞోల్లంఘనమని నుడివెను. ఉద్యోగులు దేశీయులను వందలాదిగా తుపాకులతో కాల్చి చంపుచున్నను గూడ దేశీయులు ప్రతిక్రియనాచరించగూడదని నాయకుడు దేశీయుల కుపదేశించెను. కాఠిన్యమును ప్రేమవలన జయించుటయే వారి మహోన్నతాశయము, ఇది అశక్తివలన కలిగిన లొంగుబాటనియు క్రిమిసహజమగు నీచదాస్యమనియు తలంపకుడు. ఇది పశుబలముపై మానవశక్తిచూపుమహోన్నతభావము. సామ్రాజ్యము యొక్క సైనికబలముపై గాంధిమహాత్ముడు ప్రయోగించిన నైతికబల మిదియే. దీనిఫలితము నిర్ధారణ కాకపోలేదు.

ప్రాచ్యదేశ సత్యశక్తిని దౌర్జన్యరాహిత్యమును వెల్లడించుచున్నది. త్యాగమునకేగాని దౌర్జన్యమునకు గడంగ

వలదని సంపూర్ణవిశ్వాసముతో శాంతముగ స్పష్టముగ గాంధి మహాత్ముడు బోధించును. పవిత్రయుద్ధము నైతికవిరుద్ధమును అసాధ్యముననిగూడ నాతడు బోధించును. అది భారతీయులకే కాక ఎల్లవారికిని అసాధ్యమే. భారతీయులు దుర్బలులగుటచే గాదు. వారుబలయుతులగుటచేతనే దౌర్జన్య రాహిత్యమునవలంబింపవలెనని అతడుబోధించును. ఏలనన భారతీయుల కష్టముల ననుభవించుటకును సహించుటకును వాని నతిక్రమించుటకును గూడ సమర్థులుగా నున్నారు. శత్రువులను ప్రేమింపవలెను. విరోధులనువధింపకుండ వారిఖడ్గములకు, మీకంఠములనర్పింపవలెను. ఆగ్రహము లేకుండ కారాగృహమున కరుగవలెను. ఏలననిన సర్వేశ్వరుడు ధర్మపక్షపాతి. మీకు దైవమునందు నమ్మకముగలదుగాన మీరిట్లునడుచుకొనవలెను. ప్రతిఘటింపకుండుట ప్రధానవిషయము. మీరుదౌర్జన్యమునకు గడంగినచో సర్వమును వమ్మగును. ఏలనన దానితో భరతమాత కాత్మవినాశనమే కలుగును. అని మహాత్ముడు బోధించును. అమృతసరులో సంఘమరణము కలిగించినందులకును దేశీయుల నత్యగౌరవమునకు పాలుచేసినందులకును డయరుసేనానిని శిక్షింపవలెనని మహాత్ముడు కోరుటలేదు. మన శత్రువులను మనము ప్రేమింపవలెనని ఆతడు బోధించును. తనఅనుచరులలో నెవ్వరైన ధైర్యవిశ్వాసములను గోల్పోయి దౌర్జన్యమునకు గడంగినపుడు అందులకు తనఅయోగ్యతయే కారణమని మహాత్ముడు తన్ను నిందించుకొని అందులకు ప్రాయశ్చిత్తముగా తపోపవాస ప్రార్థనల నొనరించును. అనుచరుడు దోష మొనరించిన

నాయకు డుపవసించును. ప్రపంచమునందిట్టి విశేషమిదివరకెన్నడైన వినియుంటిమా? దైవసామ్రాజ్యము సన్నిహితముకాలేదా? అయ్యది యొక్క భరతఖండమునందైన జరుగలేదా? మహాసమర్థుడగు టాలస్టాయిని గూడ గాంధిమహాత్ముడు మించిపోయెను. టాలస్టాయి యీధర్మముల వివరించు గ్రంథములను వ్రాయుట తానొక్కడును వాని నాచరించుట మాత్రమే చేయగలిగెను. కాని గాంధిమహాత్ముడాధర్మములను 30 కోట్లమంది ప్రజలచే ననుష్ఠింపజేయ గడంగెను. ఈరీతిగా ఆధ్యాత్మికసాధనమున ఘనతను జాతీయవిప్లవమును కలిగించి మానవచరిత్రయందు మిక్కిలి ప్రకాశమానమగు రాజకీయ నిదర్శనమును గలుగచేయదొడగెను.

కొంతదౌర్జన్యము కలుగకపోలేదని యొప్పుకొందము. ఇంకను కలుగవచ్చును. కాని అందుల కెవ్వరు బాధ్యులు? ఒక తుంటరి తలపగులకొట్టిన శాంతిని బోధించునత డందులకు బాధ్యుడగునా? ప్రపంచమునందలి దుర్మార్గు లందఱును తమ దుష్కృతములకు ప్రాయశ్చిత్తమొనరింప నంగీకరించువరకును ప్రపంచమునందలిదుష్కృత్యములను నివారించుప్రయత్నమును మనము కట్టిపెట్ట వలసినదేనా! పరాజితదేశములందలి ధనమును అధికారమును వశపరచుకొనిన విదేశీయులు ఆదేశములందలి పాలితులు న్యాయము న్యాయమని బిగ్గరగ ఘోషించినంతనే వారిని వధించెదరు, లేక కారాగృహమునకు పంపెదరు. అంతమాత్రమున నందులకు పాలితులే బాధ్యులని మన

మనజెల్లునా? ఆపాలితులలో కొందరు ప్రాణమువిసిగి దురాగతములకుగూడ గడంగెదరు. కాని పరధనమున కాశించి వారిని నష్టపరచి అందులకు ప్రతిఫలము నొసంగ నిరాకరించి. దానిని మరల నిచ్చివేయక వారిహక్కులనైన అంగీకరింపని పాలకులుగాక మరెవ్వరందులకు బాధ్యులగుదురు? అక్రమమును ప్రతిఘటింపక నిరంతరమును సాగనీయదగునా? ప్రజలలో తీవ్రస్వభావుడగు నేపీటరో ప్రజల హక్కులకొరకు పాలకులపై కత్తిదూసి విఫలుడైనం తమాత్రమున ప్రజల న్యాయము కొరకు ఏమైన ప్రయత్నింపకుండ మిన్నకుండవలసినదా? ఇది వింతధర్మము. ఇట్లు జరిగిన ప్రపంచమున సుగుణసంపదయును అభివృద్ధియు నంతరించిపోవును.

ప్రజలపై మరింత అధికముగ కాఠిన్యము చూపి వారి హక్కుల నింకను తీసివేయుటకు పాలకులు తరుచుగ పాలిత ప్రజాసామాన్యమునకు దురాగ్రహము కలిగించు చర్యల నొనర్చుచుండుట సహజము. ఐర్లండువారికి స్వపరిపాలనమునునిచ్చుటకు గ్లాడుస్టనుమంత్రి నిరాకరించుటవలననే ఆదేశమున సిను ఫీను ఉద్యమము ప్రారంభమైనదని మనము బాగుగా నెరిగియున్నాము. అటులే భరతఖండమునగూడ స్వాతంత్ర్యమును కోరువారివలనగాక నిర్బంధములను హెచ్చింపగోరువారివలననే సినుఫీను (అసహాయ) యుద్యమ మేర్పడుచున్నట్లున్నది.

దౌర్జన్యరాహిత్యమునకు ప్రత్యక్షభావము అసహాయ సిద్ధాంతము. మందమతులగు పత్రికాసంపాదకులు దానినే

బహిష్కరణము ఆంగ్లవస్తు బహిష్కరణమని నుడివెదరు. అసహాయోద్యమము జాతియొక్క విస్పష్టప్రకటనము. విదేశీయుడగు విజేతకు తోడ్పడరాదని దేశీయులు నిర్ణయించుట, కెయిజరు యుద్ధమున జయించి బకింగుహాము రాజమందిరమున నివసించుటయు అతనిమంత్రులు వెస్టుమినిష్టరుభవనమున చట్టముల నొనరించుటయు తటస్థించిన నీవేమిచేయుదు వని యుద్ధసమయమున నను పలువు రడిగిరి. ఇపుడు భారతీయులు చేయుచున్న దానినేనేను చేసెదనని అపుడు ప్రత్యుత్తరమిచ్చియుంటి. స్వదేశపరిపాలనమున విదేశవిజేతకు తోడ్పడరాదని నిర్ణయింపదగిన స్వభావము మానవునకసహజమా ? బోస్టనులో బ్రిటీషువారు తేయాకు పానీయము నిచ్చువిందును చేసినపుడు అమెరికాదేశీయులు బ్రిటీషు తేయాకు పానీయమును బోష్టను సముద్రపురేవులో పారబోయుట యట్టిదే. ఇది ప్రపంచములో నందరికిని సహజమే. ఘనతమమగు ఆత్మగౌరవము గల వారికిది మిక్కిలి సముచితము. విజేత యొసంగినబిరుదములను గౌరవములను చిహ్నములను నిరాకరించుట గుమాస్తా, పోలీసుకనిస్టేబు, సైనికుడు, మేజస్ట్రేటు, జడ్జి, బారిష్టరు, మున్నగు నే యుద్యోగమును అట్టివిదేశప్రభుత్వముక్రింద చేయకుండుట విదేశములనుండి వచ్చుసామగ్రులకొరకే నిరీక్షించుచుండక స్వదేశపరిశ్రమలను వృద్ధినొందించుట చిట్టచివరకు పన్నులను గూడ నీయకుండుటను స్వాతంత్ర్యప్రియులగు ప్రజలవశ్య మనుసరింపదగిన సాధనలే యగును. అది యెట్లయినను గాంధిమహాత్ముడును భారతీయులు నెట్లునిశ్చయించిరి. వారిచిహ్నము రాట్నము.

దానిని వారు తమపతాకముపై చిత్రించిరి. ఇతరదేశములవారు సింహము, ఎలుగుబంట్లు, ఘాతుకపక్షులు (ఈగలు) మున్నగు అడవిజంతువులను తమపతాకములపై చిత్రించుకొనియుండ భారతీయులు సిద్ధుష్టమగు రాట్నమును చిత్రించుకొనుట కడు సమంజసము. అది సోదరభావమునకును భూతదయకును కార్యసిద్ధికిని సూచకము. భరతఖండమున కోట్లకొలదిగృహములలో రాట్నముపై నూలువడకుచున్నారు. ఈరాట్నములధ్వని జానురస్కినుగారి చెవులకు మృదులగానములవలె నుండెడిది. ఈఫాక్టరీల పద్ధతిని మానిపదోయొకవిధమగు గృహపరిశ్రమల నవలంబింపదగునని రస్కినుగారు చెప్పెడివారు. పాశ్చాత్యనాగరికతవలన కలిగినమానవనిర్మాణశక్తిని రూపుమాపు ఫ్యాక్టరీపద్ధతి యంత్రసాధన, బాహుళ్యము, భూవపతి బొత్తుగాలేని జనసామాన్యము, మున్నగు భారతనాగరికతకు హానికరములును విలక్షణములునగు నాపదలనుండి భరతఖండమును కాపాడుటకును దానిని తప్పించుకొనుటకొరకును, ప్రారంభింపబడినగొప్పప్రయత్నమే అసహాయోద్యమము. భరతఖండమున కనుకూలమగునట్టియు భారతీయుల స్వభావమునకును అచటిపరిస్థితులకును అనుగుణమగునట్టియు పద్ధతులపై భారతనాగరకతను వృద్ధినొందించు విషయమున ఎట్టి అభ్యంతరమును కలిగింపగూడదు. ఆ పద్ధతిని నిర్ణయింపదగినవారు భారతీయులే అని ప్రకటించుటయే అసహాయోద్యమాభిప్రాయము. తమమేధాసంపదను జీవితమును సఫల మొనరింప వారు దృఢసంకల్ప మొనరించిరి. తమ గృహములపై నకంటె తమ ఆత్మలపై ననే అధిక

ముగ తమ అధికారము చెల్లవలెనని వారు పట్టుబట్టిరి. "ఈ దేశమును దీనియందలి ప్రతిష్ఠాపనలును నీ దేశమునందు నివసించు ప్రజలవే యై యున్నవి. ప్రస్తుతప్రభుత్వముపై వారి కెన్నడు విసుగుపుట్టునో అపుడు వారు సంవిధానహక్కునుబట్టి దానిని సవరించుటకును విప్లవహక్కునుబట్టి దానిని తొలగించుటకును గడంగెదరు." అని అమెరికా దేశపుస్వాతంత్ర్యసంపాదకుడగు అబ్రహాము లింకనుగారు చెప్పినరీతినే ఆధ్యాత్మిక సాధన ప్రయోగములను ప్రబలచేసి భారతీయులు గూడ మరల చెప్పగలుగుదురు.

ఇది ఆర్థిక, కార్మిక, నియోజక సంబంధమగు నుద్యమముగాదు. ఒక ప్రత్యేకకక్షకు సంబంధించిన యుద్యమమును గాదు. ఇది ఆత్మస్వాతంత్ర్యోద్యమము. ప్రతి భారతీయ వ్యక్తి ఆత్మ, అఖిల భారతదేశాత్మల (ప్రపంచము నందలి జనసంఖ్యలో నైదవవంతు ప్రజలకు నిలయమగు దేశము)విమోచనమునకు ప్రారంభింపబడిన యుద్యమము. గాంధిమహాత్ముని కారాగృహమునబంధించుట భరతఖండాత్మనుబంధించుటయే. ఇది రాజకీయావశ్యకతలపై సంస్కృత ఆధ్యాత్మిక సిద్ధాంతముల ప్రాబల్యమధికముగునట్టి రాజకీయోద్యమము. దీనియందు ఆధ్యాత్మికాంశములు ప్రబలముగా నుండుటచే ప్రపంచము నందలి విప్లవముల కిది కేవలము నూతనము. ఇది ప్రపంచమందలి మేటి రాజ్యాంగములపశుబలమునకు ఆత్మశక్తిచేయునట్టి గొప్ప ప్రతిఘటనము. ప్రజావ్యవహారములకు ఆధ్యాత్మిక శక్తిని కోటివిధంబుల గాంధిమహాత్ముడు వర్తింపజేయుచుండు

టచే నూతనమతము వెలువడుట నిశ్చయము. దీనియందతిశ యోక్తి ఏమియు లేదు. [illegible] శకమునకు పరమావధియగు మతమును సూచించి చాటి [illegible]ంచినముగ్గురు మహనీయుల పేర్లను సూచకము లగును. [illegible]ము ప్రేమజీవకారుణ్యము అపరాధక్షమ, శాంతికి [illegible] ముతము. గౌతముడు ఏసు, గాంధి. అనునవి [illegible] నామములు.

ఏమిసంశయము? [illegible] ప్రాచీనమతముల కన్నిటికిని భరతఖండమే [illegible] గాన నేడు మరల నూతన మానవవికాసమునకును, [illegible] నూతనప్రకటన మునకును, [illegible], పర్వకాల మాసన్న మగుటలో వింతలేదు. [illegible] గాంధిమహాత్ముని సిద్ధాంత [illegible] చాల్పవచ్చును. [illegible]మే నిర్ణయించును. నిష్పాక్షిక ముగ [illegible] జరుగునో ఎవ్వ డెఱుగును.

(Andhra Patrica.)

మనవి.

ఆంధ్రమహాశయులకు.

[illegible] 12 గ్రంథములు ప్రచు రింపబడును. తాము మహారాజపోషకులుగనో (రు 15-0-0) లేక రాజ పోషకులుగనో (రు 10-0-0) [illegible] పోషకులుగనో (రు 5-0-0) చేరి మమ్ము ప్రోత్సహింప ప్రార్థన.

"సుందరనిలాస్",
ఏలూరు.

ఇట్లు
సంపాదకుడు.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, బెజవాడ.

గాంధిగారి వాదం.

సోమనాథలాహిరీ.

వెల అణా.

2

1928 నవంబరు, 1000 ప్రతులు.

ప్రకాశకులు:

యువజన సంఘము,

రేపల్లె తాలూకా, వెల్లటూరు.

మా మాటలు.

మేము చాలా కాలంనుంచి యువజనులకు అవసరమైన వాఙ్మయాన్ని చౌకధరలకు ఈవిధంగా చిన్న చిన్న కరపత్రాలలో అందించాలని చాలా అవసరమని అనుకుంటున్నాం. అది నేటికి కార్యరూపంలోకి వచ్చింది. ఈ విధంగానే మహాపురుషుల జీవితాలుగాని, ప్రస్తుతరాజకీయ సమస్యలకు సంబంధించిన వ్యాసాలు గాని చిన్న చిన్న కరపత్రాలుగా ఇకముందు ప్రతినెలా 1, 2 చొప్పున ప్రకటించాలని మా ఆశయం. మా ఈ ప్రచారానికి ఎల్లరు తోడ్పడి మా ఆశయాన్ని జయప్రదం గావిస్తారని మా ఆశ.

ఇట్లు,

యువజన సంఘం,

వెల్లటూరు.

గాంధీవాదములో

నిజంగా "సత్యఅహింస"లు ఉన్నాయా?

అహింస "నిరుద్యోగాన్ని దానంతటికదే పరిష్కరిస్తుంది." (హరిజన మే 21, పేజీ 121) అని చెప్పటం అహింసకు క్రొంగొత్తగా జేర్చిన సుగుణం. గాంధీవాదులూ, సాధారణంగా ప్రజలూ గాంధిజం అంటే అహింస అని లెక్కవేస్తారు. అహింసకు రోజురోజుకూ క్రొత్తక్రొత్త అర్థాలు మూఢవిశ్వాసపు సుగుణాలు కల్పించడంచేత, నిజంగా 'గాంధిజం' అహింసా పూరితమేనా అని పరీక్షించాలసి ఉన్నది.

అల్లాహాబాదు మత కలహాలనుగూర్చి వ్రాస్తూ మహాత్ముడు ఇలా వ్రాశాడు.

"మన మంత్రులు, పోలీసుల్ని, మిలటరీని పిలచారని విని సిగ్గుపడ్డాను......కాంగ్రెసు పోయిందా? బ్రిటిషువారు జేయించారా?" అని తలచాను. అలాంటి పరిస్థితులలో మన అహింస ఎందుకు విఫలమయినది? అది బలహీనుల అహింసయా? గూండాలు (రౌడీలు) సైతము మన విశ్వాసం నుండి మనల్ని కదల్చరాదు. మనచేత "మేము మిమ్ములను జైళ్లకు పంపుతాము అవసరమైతే కాల్చి పారవేస్తాం" అని చెప్పించరాదు. వారుకూడా మన దేశీయులే వాళ్ళు మనల్ని చంపితే,

చంపనీయాల్సిందే. సంఘటితమయిన హింసను బలహీనుల అహింసతో ఎదిరించరాదు. ధైర్యముగల వారవలంబింపగల ఒక్క అహింసతోనే ఎదుర్కోవాలి."

(హరిజన్ ఏప్రిల్ 2, పే. 64)

అల్లాహాబాదులో మతకలహాలు తీవ్రంగా వృద్ధిచెందాయి. ఎవరో కొందరు స్వార్థపరులచే మూఢనమ్మకాలు గలవారు పురిగొల్పబడి బహిరంగంగా, లా, అండ్, ఆర్డరును ధిక్కరించారు. వాళ్ళకి నిజంగా అలా చేయడానికి కారణమూ లేదు, కష్టాలూ లేవు. అనవసరంగా అమాయక ప్రజల రక్తం ప్రవహించబడింది. కాంగ్రెసు ప్రతిష్టను భగ్నం కావించాలని (ఈవిధంగా) ప్రయత్నాలు జరిగాయి. అయినా, మన మంత్రులు "పోలీసు సహాయం, మిలటరీవారి సహాయం కోరి యుండవలసినది" గాదట! గూండాల యెడలకూడా అహింసావ్రతులై యుండవలెనట!!

నిజమే. ఈ అహింసా సిద్ధాంతాన్ని ఉన్న దున్నట్లుగా అంతా, మనం ఒప్పుకొన్నట్లయితే — చాలామందికి ఇది అబద్ధంగా కనబడినా — పైన చెప్పినట్లు చేయాలిసి ఉంటుంది. గాంధిగారు దానికే అంటిపెట్టుక కూర్చుంటారు. అందుకు మహాత్మునికి అభివందనాలు.

ఇష్టములేని సత్యాన్ని విడచిపెట్టడం.

కాని, గాంధిగారు గవర్నమెంటు కాని, మంత్రులుగాని

గావించిన హింసకు అంతనిక్కచ్చిగా మాటాడుతూ వచ్చారా? ఈ మత కలహాలు జరిగిన రోజుల దాదాపుననే చీరాలలో కాల్పులు జరిగాయి. లాకౌట్ చేసి, మిల్లు యజమానులు వారి భృత్యం గడవకుండా జేశారు సమ్మె భగ్నంచేసి యజమానులు పని చేయించుకోవాలని చూస్తుంటే, ఇతర కార్మికులను పోకుండా చేయడానికి ఫ్యాక్టరీ ముందు కార్మికులు సమావేశమయ్యారు. పోలీసులు మామూలుగా చెప్తూ వచ్చినట్లు, చీరాలలో తమపై రాళ్లు రువ్వారని చెప్పారు. లాఠీఛార్జి జరిగింది. తుపాకి గుండ్లు పేల్చారు. ఇద్దరు వెంటనే మరణించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిలో ఒకడు హాస్పిటలులో మరణించాడు. ఎంతో వెనుకా ముందూ ఆలోచించి మద్రాసు మంత్రివర్గం ఒక ఐ. సి. యస్. ఉద్యోగిని విచారించడానికి జడ్జీగా వేసింది. ఆయన పోలీసుల కాల్పులను సమర్థించాడు. ఈ కాల్పులు దేశాన్నంతా కలవర పరచాయి. ఈ పోలీసుల దౌర్జన్యాన్ని, కాంగ్రెసు కమిటీలు, ట్రేడ్ యూనియన్లు, చివరకు ముస్లింలీగులు, బార్ అసోసియేషన్లు సైతం ఖండించుచూ తీర్మానించాయి. గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ నిర్ణయించిన విచారణ సంఘం, కార్మికులు శాంతముగా ఉన్నారనీ, పోలీసులే దౌర్జన్యం చేయాలని చేశారనీ తెల్పారు. ప్రభుత్వ విచారణ కమిటీ రిపోర్టును ఖండిస్తూ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం, ఒక అనధికార విచారణ కమిటీ కావాలని అడిగింది. ఇదంతా పత్రికలలో చదివాం.

గాంధిగారు, మత మూఢవిశ్వాసాలతో హంతకుడైన వాని యెడల–దొంగచాటుగా పొడిచే 'గూండా'ల యెడల–అహింస అంటారు. ఒకవేళ కార్మికులే హింస గావించారను కొందాం. అయినప్పటికీ గాంధిగారి సిద్ధాంత ప్రకారం, గాంధి గారు, ఆయన శిష్యులు ('అహింసావాలా'లు) కాంగ్రెసు మంత్రివర్గం గావించిన హింసకు అసమ్మతి చూపి యుండ వలసిందేగా!

కాని గాంధిగారి ప్రకటనలలోగాని, ఉపన్యాసాలలో గాని ఈ విషయం ఎంత వెదికినా కన్పించదు. 'హరిజన్' పత్రిక ఫైలు తీసి ఫిబ్రవరినుండి మే వరకు వెదికినా, ఒక అక్షరంకూడా దాని విషయం కన్పించదు. అది కావాలని విడిచి పెట్టారు. దేశంలో ఇది జరగలేదా అన్నట్లు నిర్లక్ష్యం వహించారు.

"మీరు అహింస మీద సూక్తాలు పల్కుతున్నారు సత్యానికీ, కాంగ్రెసు నైతిక జీవనానికి మీరే అంతా పోషం కర్తయొక్క బాధ్యత తీసుకుంటున్నానని తెల్పుచున్నారు. మరి ఈచీరాల కాల్పులు, నిరాయుధ ప్రజలపైన కాల్చడం, వచ్చి హింస కాదా? నిజమును మరుగుపర్చడం అబద్ధం చెప్పినంత ఏహ్యకరమైనది కాదా? గవర్నమెంటు హింసను కాంగ్రెసు మంత్రులు సమర్థించడంచేత, "కాంగ్రెసు నీతికి" భంగం కల్గలేదా!!" ఈ ప్రశ్నలు నిజంగా గాంధిజం అహింసా పూరితమేనా యని సందేహానికి తావిస్తాయి. "సత్యములు"

లిస్టులోనుంచి హితవుకాని "సత్యాన్ని" గాంధీజం విడచి పెడుతుందా ? అని ఆశ్చర్యం గల్గుతుంది.

నిర్బంధ విధానాన్ని సమర్థించడం.

కొన్ని నెలల వెనక్కి పోదాం. కాంగ్రెసు మితవాదులు ఇష్టపడని రాజకీయాలలో పాల్గొనే సోషలిస్టుల, కమ్యూనిష్టులపై నిర్భంద విధానం కొనసాగుచూ ఉన్నపుడు దేశములో ఒక తీవ్ర అందోళన చెలరేగింది. కాంగ్రెసు మంత్రి వర్గాలకు వ్యతిరేకంగా దేశంలో తీవ్ర ఆందోళన జరిగింది. ఎక్కువగా మితవాదుల ప్రాబల్యంగల వర్కింగు కమిటీ, గాంధిగారి అహింసా సత్యాలచేత, ఆవేశము పొందిన వర్కింగుకమిటీ (అలా అని వారే రోజు రోజూ ప్రకటనలు గావిస్తూంటారు.) కాంగ్రెసు మంత్రివర్గాల నిర్బంధ విధానాన్ని సమర్థించుతూ తీర్మానించింది. (జనవరి 1938).

"........మంత్రులు, పౌర స్వేచ్ఛ ప్రజాస్వామ్య సిద్ధాంతాల ఆధారంతో నడుచుకోవాలి. నిర్బంధం కంటె, ఒప్పించుటకు యత్నించాలి. కాని నిర్బంధ విధానాన్ని తొలగించు కోర్కె ఎంతో యున్నను దానికి విరుద్ధంగా నిర్భంధ విధానము మంత్రులకు అవసరము కావచ్చును. అలాంటి పరిస్థితులలో, మంత్రులు, తప్పకుండా, దానికి పూనుకోవాలి. హింసగాని, హింసను పురికొల్పుటగాని, మతకలహాలు కల్గినపుడుగాని మాత్రమే అట్టి నిర్బంధ విధానానికి పూనుకోవాలి."

ఈ తీర్మానం గాంధిగారితో దీర్ఘకాలం చర్చింపబడ్డాకనే వ్రాయబడింది. కొందరు గాంధిగారే దీన్ని వ్రాశారంటారు. ఇది నిజమయినా కాకపోయినా, గాంధిజీ సిద్ధాంతాలకు ఛాంపియన్లు అనదగిన పటేల్, కృపాలినీ వంటివారు, దానిని సపోర్టు చేశారు. ప్యాసయింది!

ఈ తీర్మానంలో కాంగ్రెసు మితవాదులు, మంత్రి వర్గాల ద్వారా, తమకిష్టములేని రాజకీయాలను, హింసను పురికొల్పేనను వంకతో, అణుచుతారనే భయం (నిజానికి షోలాపూర్‌లో అదే విధంగా చేశారు.) వదలివేసినా, కాంగ్రెసు 'హింసను పురికొల్పటాన్ని' అరికట్టడానికి 'హింస' నుపయోగించడానికి అనుమతిస్తుంది.

దీనితో గాంధిగారి ప్రేమసూత్రం ఎలా సరిపోతుంది? పటేల్, కృపాలినీ మొదలయిన అహింసా—సత్య సిద్ధాంత వీరులు, తమ గురువుగారి సిద్ధాంతం ఇలా దిగజారుతుంటే ఎందుకు ఊరుకున్నారు? పైగా గాంధిగారు దీన్ని ఆపడానికి ఎందుకు ప్రయత్నించలేదు. ఈవిషయమై నోరు మెదల్పకుండా ఉండటంవల్ల, గవర్నమెంటు హింసా సిద్ధాంతానికి పరోక్షపు సపోర్టును గాంధిజీ ఈయలేదా ?

"హిస్ మాస్టర్స్ 'వాయిస్"ను బాగా భాష్యీకరించే మహాదేవ దేశాయిగారు, పై నిర్బంధ విధానాలను గురించి వ్రాస్తూ 1937 డిశంబరు 18వ తేదీన "పౌరస్వేచ్ఛ అంటే యేమిటి?" అంటూ వ్రాశారు.

"స్వాతంత్ర్యమంటే లైసెన్సు అనికాదు. అహింసా సత్యాలకు కట్టుబడిన కాంగ్రెసు 'పౌరసత్వ హక్కుల' కొరకు నిలబడిందంటే అర్థము 'అహింసా సత్యములు' అనే షరతులతో గూడిన స్వేచ్ఛకే అని తెలుసుకోవాలి."

మరొక సంచికలో ఆయన ఇంకా విపులీకరించాడు.

"వైషమ్యము కల్గించుటకుగాని, వర్గకలహము తెచ్చుటకుగాని, హింసను పురికొల్పడం, కాంగ్రెసు మంత్రులు కూడా సహించలేరు." (హరిజన్ 8 జనవరి 1938).

వీటి అర్థం ఏమిటి? అహింసను దాటిపోయే స్వేచ్ఛకు అడ్డు తగులాలి. అంటే 'హింసను హింసతోనే అణచాలి' అని ఆయన భావం.

ఈ ధీరుల అహింసా సూత్ర ప్రకారం 'గూండా'లను ప్రేమించు సూత్రం ఏమవుతుంది? పటేల్, కృపాలినీ వంటి వారల నుండి 'అహింసా యుతమైన 'ప్రేమ'ను పొందాలంటే, ఆ 'గూండా' తన పొట్టకోసం పోరాడే కార్మికుడు కాగూడదు. సామ్రాజ్యవాదాన్ని కూలద్రోయటానికి పోరాడే సోషలిస్టు కాని, కమ్యూనిస్టు గాని కాగూడదు. ఒకచోట వర్తించేది ఇంకోచోట వర్తించదు.

ఇంకా సందేహం ఎక్కువ అవుతున్నది. నిజంగా గాంధీజీ సత్య—అహింసలకు మొక్కవోని ఛాంపియను అగునా? ఇంకా కొంత ముందుకు పోదాం.

అహింస—కాంగ్రెస్.

ఏప్రియల్ 9వ తేదీ 'హారిజన్'లో మహాత్ముడు "కాంగ్రెసువారు, ప్రతివారూ అహింసకు కట్టుబడే ప్లెడ్జిపై సంతకము చేయాల్సివుంటుంది." అని వ్రాశాడు. అందరూ ఇది నిజమే ననుకుంటారు. కాని ఇది నిజమా? నేను మెంబరుగా చేరుతూ ప్లెడ్జిపై సంతకం చేసినపుడు, ఇలా వ్రాసివుంది.

"కాంగ్రెసు యొక్క ఆశయం పూర్ణ స్వరాజ్యమును హిందూదేశ ప్రజలద్వారా శాంతి యుతంగానూ, న్యాయబద్ధంగాను (లెజిటిమేట్) పొందుట."

శాంతియుతంగా ఉండటం అంటే, ఇతరుల శాంతిని మీరు నాశనం గావించాలని అనికాదు. అంటే మీరు ఇతరులు చేయాలనిచేసిన, హింసనుండి రక్షించుకో నవసరము లేదనీ అర్థంకాదు. శాంతియుతమైన పద్ధతులు అంటే ఆత్మరక్షణ వలదని చెప్పదు. శాంతియుత విధానం అంటే, దౌర్బల్యం అని అర్థంకాదు. ఇతరుల హింసాయుతమగు బెదరింపును శక్తివంతంగా ఎదుర్కొనుట తప్పుకాదు. అది న్యాయబద్ధమైనది కూడ. (లెజిటిమేట్)

1935లో బొంబాయి కాంగ్రెసులో, "శాంతియుత, న్యాయమైన పద్ధతులకు" బదులు "అహింసా, సత్య పద్ధతుల"పై అని కాంగ్రెసు సిద్ధాంతాన్ని మార్చడానికి ప్రియ

త్నాలు జరిగాయి. కాని అధిక సంఖ్యాకులు దీని కంగీక రించలేదు. దీని అర్థమేమిటి? అధిక సంఖ్యాకులగు కాంగ్రె సువారికి 'శాంతియుత' 'అహింసాయుత' పద్ధతులకుగల భేదం తెలుసునన్న మాట. వారు తెలుసుకొనే " శాంతియుతం " అనే పదాన్ని కోరారన్న మాట.

సత్యము పేరిట, కాంగ్రెసులో ఒకపక్షమువారి అవక తవక తత్వపు ఆధారంతో నిర్మించబడిన పరస్పర విరుద్ధ పుగు సిద్ధాంతాన్ని, యావత్ కాంగ్రెసు పైన రుద్దాలని చూచినపుడు; నిజమయిన కాంగ్రెసు వెడిపై విడిచిపెట్టు డానికి నిర్బంధ విధానములను సైతము తీసుకొనుచున్నపుడు; గాంధిజం అహింసా సత్యములకై నిల్చుతుందని తలంచడం ఎలా?

చౌరీ చౌరా తత్వం.

ఇంకొక ఉదాహరణ తీసికొందాం. బిజాపూర్ జైలులో ఒక ఖయిదీని కొరడాతో కొట్టారు. అతడు సాధారణ ఖైదీ కాడు. రాజకీయ ఖయిదీల దినోత్సవం సల్పుచున్న సంద ర్భాన షోలాపూరులో అరెస్టు చేయబడిన రాజకీయ ఖయిదీ. కాంగ్రెసుతో గూడుపుఠాని చేసిన అధికారులు, మంత్రులు, అతనిని రాజకీయ ఖయిదీగానే ఎంచలేదు. అతనిని ఒక క్రిమి నల్ ఖయిదీగా ఎంచారు. పైగా కొరడా దెబ్బల ప్రసాద !

దేశమంతా కోపమూ, అసంతృప్తీ చూపింది. ల

కత్తా మేయర్ సైతం కొండాలతో కొట్టుటను ఖండించాడు. చాలమంది ప్రముఖ కాంగ్రెసు వాదులు కూడ దీనిని ఖండించారు. అమానుషమైన, పిరికితనంతో కూడిన ఇలాంటి హింసకంటె నురేమైన ఉంటుందా? ఎవడైనా ఆత్మరక్షణ చేసుకోగల వానిపై ఒక దెబ్బ వేయుటలో కొంత అర్థం ఉండవచ్చును. కాని జైళ్ళల్లో మీ చేతుల్లో బంధింపబడిన వానిపై హింస గావించడం కంటె, పిరికితనమూ, నైతిక పతనమూ ఉందా? ఒక యుద్ధ ఖయిదీని కాల్చడం ఎలాంటిదో ఇదీ అంతే.

ఈ దురంతాన్ని ఖండించడానికి, అహింసా వ్రతులగు మహాత్ముడు, అతని అనుచరులు పూనుకుంటారని ప్రతివాడు ఆశిస్తాడు. అహింసా వ్రతులు కాని వారిని సైతం, మానవత్వం అనేది, వారిని ఈ దురంతాన్ని ఖండించుట తమ విధియని యనుకొనునట్లు చేసింది.

కాని ఒక్క మాట—మహాత్ముని నుండిగాని— ఆ శిష్యుడగు మహాదేవ దేశాయి నోటనుండి గాని వచ్చిన పాపాన పోలేదు! మహాత్ముని అనుచరులు 'అహింసను' మరచిపోయారా? ఈ ఘోరమంతా కాంగ్రెసు గవర్నమెంటు (బొంబాయి) క్రిందనే జరుగుతూంటే, దేశం అంతా గగ్గోలు పెడుతూంటే దేశాయిగారు ఈ వార్తను అణచివేసి ఇంకో వ్యాసముతో తయారయ్యారు. " చోరీ-చౌరా తత్వం " అని

దానిపేరు. (మే 21, 1918) ఆయన అస్పష్టమైన ఒక ఘటన తీసుకొని చెప్ప మొదలెట్టాడు.

ఒక గ్రామములో అరెస్టు చేయడానికి వెళ్ళిన పోలీసులలో ఒకనిని దిగంబరునిజేసి కట్టుకొయ్యకు కట్టివేశారట. సబినస్పెక్టరు వచ్చి చూశాడు. తన సోదరుడు బంధింపబడటం చూచి 'రివాల్వర్‌ను ఉపయోగించాడు'. ఎవరి మీద? నిరాయుధులగు ప్రజలపైన. "ఇద్దరికి గాయాలు తగిలాయి." అప్పుడాగుంపు ఇనస్పెక్టరును నిరాయుధునిచేసి అతన్నికూడా కట్టుకొయ్యకు కట్టారు.

దేశాయిగారి రిపోర్టు ప్రకారం. సబ్ ఇనస్పెక్టరు రివాల్వరుతో ఇద్దరిని గాయపరిచాడు. కాని ప్రజలు అతన్ని నిరాయుధుణ్ణి చేసి బంధించారు.

యు.పి. మంత్రులు, మతకలహాలను ఆపడాన్ని గురించి వ్రాసిన 'హరిజన్' పత్రిక సిద్ధాంత ప్రకారం గాకపోయినా, సాధారణంగా మహదేవ దేశాయి, ఈ గ్రామస్తులను, ఇనస్పెక్టర్ యొక్క హింసను ఖండించుతాడని ప్రతివాడూ ఆశిస్తాడు.

కాని విచిత్రమేమంటే, "గూండా" లను సైతం ప్రేమించాలన్న గాంధిగారి శిష్యుడు మహదేవ దేశాయి, ఇనస్పెక్టర్ కాల్చడం గాని, గ్రామస్థుల గాయాలను గూర్చి

గాని ఏమన లేదు సరిగదా గ్రామస్థులను కఠినముగా దూషి స్తాడు! ఆయన ఇలా వ్రాశాడు.

"పోలీసు ఆఫీసర్లను అతిక్రమించి, నిరాయుధుల గావించి, కట్టుకొయ్యకుకట్టి, దోపిడి చేసారను వార్తలు నిజమే ఐతే, గ్రామస్థులు 'లా'ను తమ చేతుల్లోకి లాక్కొనడాన్ని - అవతల వాళ్ళు ఎంత రెచ్చగొట్టినా సమర్థింపదగిన విషయం గాదు......ఇది "చౌరీచౌరా"ను జ్ఞాపకం తెస్తుంది.

కాంగ్రెసు రాజ్యం ఇంకా రానేలేదు. దాని అస్పష్టమగు నీడయే, మనలను ఇంతదూరము లాక్కొనివెళ్ళి నిషాగ్రించితే, ఇక నిజంగా కాంగ్రెసు రాజ్యం వస్తే ఏమవుతుందో అని ఆశ్చర్యపడాలి!

త్వరలోనే కాంగ్రెసు రాజ్యం ఆచరణలోకి రాదను భయం లేదు. కాని, "అహింసా" పునాదులను వేయుటలోనూ, వేయక పోవడంలోనే స్వరాజ్యభవన నిర్మాణమో, నాశనమో ఆధారపడి ఉంటుంది."

దీనికి వ్యాఖ్యానం అవసరమా?

సోషలిస్టు ఫిలాసఫీ ఒక్కటే సత్యం కోసరం రాజీలేని పోరాటం సాగిస్తుంది. సోషలిస్టు చైతన్యమే హింసను తగ్గించుటకు గ్యారంటీ అవుతుంది.

మనం సర్దార్‌గారిని పూర్తిగా మరచి పోయాం. అహింసా సూత్రానికి తీవ్ర భాష్య కారుడాయన.

కుతర్కం లేకుండాను, బండగాను (ఆయన స్వభావం అది) రెండు నెలల క్రిందట శరన్‌లో ఇలా చెప్పాడు.

"సత్య-అహింసా మార్గాలనుండి తప్పడంవలన మనం పొందిన విజయాన్ని కాస్తా పోగొట్టుకొంటాం. చెడు జమీందార్లు, తను పద్ధతిని మార్చుకో పోతారా, వాళ్ళగొయ్యిని వాళ్లే త్రవ్వకుంటారు. కాని, మనం వాళ్ళమీద ఒక దెబ్బ గొట్టి ఒక విషపూరిత వాతావరణాన్ని కల్గించడం దేనికి?"

జమీందార్లు చెడువారు కాకపోయినా, రైతులను, సాధ్యమైనంత ఎక్కువ శిస్తు చెల్లించవలసినదని నిర్బంధిస్తారు. ఇక చెడ్డ జమీందారు సంగతి చెప్ప నక్కరలేదు. రైతును కొడతాడు. అన్యాయంగా అక్రమంగా డబ్బు లాగుతాడు; పంట కోసుకుపోతాడు. భార్యా పిల్లలను అవమాన పరుస్తాడు. దీనికై అసమ్మతి చూపితే రైతు ఇల్లు తగుల బెడతాడు. దురదృష్టవశాత్తు ఇండియాలో చెడ్డ జమీందార్లే ఎక్కువ. ఈ విధంగా హింసించడం జమీందార్లకు కూడా సాధారణమే. కాని పటేలుగారి సిద్ధాంత ప్రకారం ఈ చెడ్డ జమీందార్ల దుష్కృత్యాలను ఎదిరించరాదు. ఎదిరిస్తే సత్య-అహింసా మార్గాలనుండి తప్పిన వారౌతారు. ఈపవిత్రమైన బీజాక్షరాలను జపిస్తూ పోయి పటేలుగారు, వర్కింగు కమిటీవారు గావించిన తీర్మానాన్ని — హింసను పురికొల్పినందుకు అపరాధులగు వారిని శిక్షించుటకై నిర్బంధచర్యకు

(అంటే హింసాయుత చర్యకు) పూనుకోవలెనన్న తీర్మానాన్ని - సపోర్టు చేశాడు!

హింసను పురికొల్పేవారు, పటేలుగారి లెక్క ప్రకారం విషపూరిత రాజకీయ వేత్తలు. అందుకని అవసరమైతే వారిని కఠినంగా అణచాలి. కాని ఆ చెడ్డ జమీందార్లలాగానే, ఈ విషపూరిత రాజకీయ వేత్తలనుగూడా వాళ్ళ గొయ్యిని వాళ్ళనే ఎందుకు త్రవ్వుకోనీయరాదు? కాంగ్రెసు మాత్రి వర్గాల ద్వారా, హింసను ఉద్రేకపరిచే వారిని ఒకదెబ్బగొట్టి "ఒక విషపూరిత వాతావరణాన్ని" సృష్టించడం దేనికి?

అహింసా సత్యాలను బాగా భాష్యీకరించే వారును, ఈ పడికట్టు రాళ్ళ పదాలను మరో సిద్ధాంతాలవారిని అణచడానికి ఆయుధంగా ఉపయోగించుకొనే టటువంటి వారును ఐన పటేల్ మహాదేవ దేశాయి, కృపాలినీగార్లను వదలి పెడదాం. గాంధిగారు మాత్రం, ఆయన అహింసాసూత్రాల వలన కలిగే ఫలితాలకు బద్ధుడవడానికి నిజంగా ప్రయత్నిస్తాడు. అందుకనే ఆయన "గూండా" (రౌడీ)లకు కూడ ప్రేమ చూపించమంటాడు. ఆయన సుస్థిరంగా అహింసాత్మకంగా ఉండాలని ఎంతగానో వాంఛించినా, ఆసిద్ధాంతపు తర్కవిహీనపు పునాదియే, భౌతిక పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చునపుడు, ఈసిద్ధాంతాన్ని మరచి గవర్నమెంటు హింసను ఆయన నోటిద్వారానే ఈక్రింది విధంగా సమర్థించవలసి వచ్చింది.

"కాంగ్రెసు మంత్రులు, అహింసలో నమ్మకముంటే, ఈ పరిశోధన (అహింసయొక్క అవకాశాలు)కు పూను కొంటారు. వారు యిలా చేస్తున్నప్పుడు - లేక వారిది చేసినా చేయకపోయినా—ఒకటి మాత్రం నిశ్చయం. హింసను ఉద్రిక్త పరచడం గాని, హింసా పూరితంగా కనబడే ఉపన్యాసాలను గాని, ఒకవేళ వారు (మంత్రులు) హింసాయుతంగా ఉన్నారనిపించుకొని నప్పటికిని , సహింప జాలరు. (హరిజన్ 1937 అక్టోబరు 23.)

ఒక రాజకీయ సిద్ధాంతాన్ని ఒప్పుకొంటే పూర్తిగా ఒప్పుకోవాలి. లేదా పూర్తిగా తిరస్కరించాలి. ఆ సిద్ధాంతంవల్ల వచ్చే ఫలితాలను అది ఎదుర్కొనగలిగి ఉండాలి, లేదా దానిని నెట్టి పారవేయాలి. పర్యవసానం ఏమంటే అహింస ఈ పరీక్షకు నిలవగల సిద్ధాంతంకాదు.

పైన వ్రాసిన దానినంతనూ బట్టి ఇది స్పష్టమౌతుంది. అహింసను బలపరచే వారందరూ మొదట అహింసతోనే బయలుదేరుతారు. కాని యదార్థ పరిస్థితులవల్ల ప్రభుత్వము ఎక్కడెక్కడ వారి రాజకీయాలను సమర్థించుతుంటుందో, ఎక్కడెక్కడ ప్రభుత్వ వ్యతిరేక కార్యాలు (వాదనకోసం దానిని ప్రభుత్వ హింసకు వ్యతిరేక కార్యాలు అని పిలుద్దాం) వారు బోధించే రాజకీయాలకు అడ్డు తగులుతాయో, అక్కడక్కడ వారు (గాంధీ వాదులు) మాటిమాటికి గవర్నమెంటు హింసను సమర్థించే పరిస్థితికి వెనక్కి పోతున్నారు.

ప్రభుత్వ నిర్మాణం దేనిపై ఆధారపడి ఉన్నది? అను సామాన్య ప్రధాన సూత్రాలను ఏమరుపాటుగా వీక్షించకుండా ఉంటే వీరు ఈ పరస్పర విరుద్ధతలో చిక్కుకొని ఉండేవారు కారు.

ప్రభుత్వం అనేది సంఘటితమైన హింస అనే నిర్వివాదమైన విషయాన్ని చూడకుండా కళ్ళు మూసు కొంటారు. సాయుధులగు పోలీసులు, మిలిటరీ, జైళ్లు, వీటితో ప్రతిప్రభుత్వమూ పాలింపబడే వర్గంయొక్క తిరుగబాటును అణచి వేస్తుంది.

అందుకనే ఈ అహింసా మంత్రాన్ని జపించే ధాంధీయనులు, ఎక్కడెక్కడ కాంగ్రెసు మంత్రుల ద్వారా గవర్నమెంటు మెషినరీ తమ చేతుల్లో ఉందని తలుస్తారో, అక్కడక్కడ పాలింపబడే ప్రజల ఆశయాలకు విరుద్ధంగా నున్న గవర్నమెంటు నిర్బంధ విధానాన్ని (పౌరసత్వ హక్కులకు వారిచ్చిన వాగ్దానం సాధ్యమైనంత వరకు బాహ్యతిగా అబద్ధమని కన్పడకుండా ఉండేటట్లు) సమర్థిస్తారు. కాని ఈ విషయంలో గొప్ప తప్పు చేస్తున్నారు. గవర్నమెంటు ఇంకా వీరిదికాదు అనే విషయం మరచి పోతున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్య సిద్ధికై, కాంగ్రెసు కార్యక్రమం ద్వారా, పనిచేయుచున్న వివిధ సిద్ధాంతాలుగల రాజకీయ వేత్తలునూ, ప్రజా సామాన్యమునూ, ఏదో అధికారం ఉన్న

దని తలంచుతున్న ఆ అధికారాన్ని, వారి (మంత్రుల) చేతిలో పెట్టారు అన్న విషయం మరువరాదు. వారు (అహింసా వాదులు) ప్రజలను మరచిపోతారు. తాము ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతాలకు, ఒక ప్రత్యేక పక్షానికి ప్రతినిధుల మన్నమాట మరచిపోతారు. యావత్ దేశ కాంగ్రెసుకూ తామే ప్రతినిధులమని తలంచుతారు. అధికార ఛాయలనే ఛలాయించుదామనే ఆతురతలో బ్రిటీషు సామ్రాజ్యమనే పెద్ద వయ్యాన్ని ఒకదాన్ని కూలద్రోయవలసి ఉన్నదనీ,అలా కూలద్రోయడానికి వివిధ అభిప్రాయాలు గల భిన్నపక్షాల వారందరూ కలసి, దృఢంగా జీవన్మరణ పోరాటం సాగించాలనీ, వారు మరచి పోతారు.

తమ గందరగోళ ప్రభావాలను ప్రతివారి నెత్తినా రుద్దాలనే ప్రయత్నంతో గవర్నమెంటు బలాన్నికూడా ఉపయోగించి, వివిధ రాజకీయాభిప్రాయాలుగల వారిని అణచడంతో, వారు జాతీయ ఉద్యమ ఐక్యతను బలహీన పరుస్తున్నారు. అలా చేయడంలో సామ్రాజ్య వాదాన్నికూడ బలపరచిన వారౌతున్నారు.

కమ్యూనిస్టులు—హింస.

కాని కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వారే హింసను బోధిస్తున్నారు. రైతులను తిరస్కరించవద్దని, జమీందార్ల హింసను పరోక్షంగా బలపరుస్తారు. ఈ మాటల ప్రతిధ్వ

నులు ఇంకా అంతర్ధానం కాకముందే ప్రజలవద్దకు వెళ్ళి "సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ హింసను ప్రేరేపిస్తున్నారు. వారిని జాతీయ ఉద్యమాన్నుండి తరిమివేయాలి." అంటూ చెబుతారు. సర్దార్ పటేల్‌గారు "హిందూదేశపు విజ్ఞానానికి, ఆచార పరంపరలకు విరుద్ధంగా, పాశ్చాత్య భావాల చేతను, హింసా చిహ్నమగు ఎర్రజండా చేతను ఉద్రేకము పొందవలదని బీహారు రైతులకు వార్నింగు ఇచ్చారు. (అమృత బజారు పత్రికలో పటేల్‌గారి ఉపన్యాసం. ఏప్రియల్ 10.)

ఇంకేం! ప్రజలంతా ఎర్రజండా వాళ్ళ మతము హింసావాదం అని అనుకుంటారు.

కాని సర్దార్ పటేల్‌గారు సోషలిస్టుల, కమ్యూనిస్టులపై మోపిన నింద ద్వేషపూరితమైనది. సోషలిస్టులకు, కమ్యూనిస్టులకు హింసను పురికొల్పు ఇచ్ఛ, యిసుమంతైనా లేదని, వారు దానిని బోధించరనీ, తేటతెల్లంగానూ, గట్టిగాను చెప్పనీయండి! హింసా నిరోధాలకు వ్యతిరేకంగా శాంతి అభివృద్ధులనూ, అనాగరికతకు వ్యతిరేకంగా నాగరికతనూ కోరేవారిలో సోషలిస్టులు, కమ్యూనిస్టులే మొదటివారు.

కమ్యూనిస్టు సిద్ధాంతమే 'సత్యము'నకు రాజీలేని, స్థిరమైన ఛాంపియన్.

సర్దార్ పటేల్, ఆయనలాగే తలి నే ఇతరులు, సిద్ధాంతరీత్యా 'అహింస 'ను బోధించుతారు. కాని పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు, హింసను ఉపయోగించుట, బలపరచుట, వారు ఆచరణలో చేయవలసి వచ్చిన పని.

వాదరహితమైన గాంధీ విధానముపై వారికున్న అభిమానం అడ్డం వస్తోంది గాని లేకపోతే వారూ కమ్యూనిస్టులు చెప్పే నిర్వచనాలే (formulation) చెప్పవలసి వచ్చేది. వారి మాటలకూ చేతలకూ యీ అభిమానంవల్ల వచ్చే తేడాను కనుపించకుండా చేయడానికి ప్రజలలో కలిగే అనుమానాన్ని అణచి వేయడానికి, యుక్తులనూ, ఉత్సాహపూరిత పదజాలాన్నీ ప్రయోగించవలసి వస్తోంది.

కమ్యూనిస్టులకు తమ ఆశయాలను దాచుకోడం కిట్టదు. ఒక విషయాన్ని శాస్త్రీయంగా పరిశీలించి, ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత దాని అంతు తేలేవరకూ దాన్ని అవలంబించడానికి వెనుదీయరు. వారు హింసను ప్రచారం చేయరు. హింస మనపై రుద్దబడవచ్చునని భవిష్యత్తు చెప్పుతారు.

ప్రస్తుత సామాజిక విధానంలోనే హింస ఇమిడి ఉంది.

హింస అనేది ప్రస్తుత సామాజిక విధానంలోనే ఇమిడి ఉంది. సామ్రాజ్యవాదులు హిందూదేశాన్ని హింస ద్వారానే

జయించారనే విషయం నిర్వివాదం. తరువాత దాన్ని ఆస్థానములో నిలిపేదికూడా హింసే. తన పునాదిని కూలద్రోయుటకు జరిగే ప్రయత్నాలన్నిటినీ, ఎదుర్కోడానికి తన యావత్తు బలాన్ని, హింసా విధానాన్ని సామ్రాజ్యవాదం ప్రయోగిస్తుంది.

దీనిని గాంధీగారు కూడా కాదనరు. గతంలో మన అనుభవాలూ, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ దేశాలలో అనుభవాలూ, యీ విషయాన్ని తేట తెల్లముగా చూపుతున్నాయి.

రామ్సే మేక్డోనాల్డుగారు కమ్యూనిస్టులను నిందించినట్లు మన పటేల్ గారు ఎర్రజండావారిని హింసను ప్రచారం చేస్తున్నారని నిందిస్తారు. ఆ రామ్సే మేక్డోనాల్డుగారికి విఖ్యాత కమ్యూనిస్టు ఆర్. పామీదత్తు ఇలా సమాధాన మిచ్చాడు.

"విప్లవకారులు హింసనూ అంతర్యుద్ధాన్నీ ప్రచారం చేస్తారనడం శుద్ధఅబద్ధం. పెట్టుబడిదారీ వర్గంయొక్క హింసను కార్మికవర్గం ఎదుర్కోవలసి వస్తోందనియు, కార్మికులు తమ స్వరక్షణకోసం పెట్టుబడిదారీ వర్గపు శాసనాలు, ప్రభుత్వ యంత్రం, మొదలగు వాటిని ఏమాత్రమూ నమ్మజాలరనియు చెపుతారు. రోజూ జరిగే సంఘటనలు ఇందలి సత్యాన్ని ఋజువు చేస్తున్నాయి."

" పోనీ ఒక ఉపమానము ఇస్తాను. ఆలోచించండి.

ఒక శాస్త్రజ్ఞుడు పరిశోధించి, గుణకారాలువేసి, ఫలాని ఇన్ని సంవత్సరాలకు, ఫలాని, ఇంగ్లండులో ఒక భూకంపం వస్తుందనియు అప్పటికి ఇళ్లూ అన్నీ ఫలాని పద్ధతిపై కట్టకపోతే, అన్నీ కూలిపోతాయని చెపుతాడు అనుకోండి. ఆయన నిర్ణయాన్ని నమ్మకపోవచ్చు. ఆనిర్ణయానికిగల కారణాలన్నీ విపులంగా చర్చించి, అవి ఎంతవరకు రూఢియో సత్యమో పరిశీలించవచ్చు. ఇదీ న్యాయం. అంతేకాని "తుచ్ఛుడీ శాస్త్రజ్ఞుడు! భూకంపాలు రావాలంటాడు! మన ఇళ్లూ, వాకిళ్లూ కూలిపోవాలట. గెంటెయ్యండి వాడిని భూకంపాలు జపాను వాళ్ళకి కాని మనకి అక్కర్లేదు" (దీనిని "భారతీయ సాంప్రదాయానికి విజ్ఞానానికి వ్యతిరేకమగు హింస" అన్న పటేల్ గారి మాటలతో పోల్చి చూడండి) మేమెప్పుడూ సుఖంగా ఉంటున్నాం. ఈ శాస్త్రజ్ఞుడిని దేశంలోంచి తరిమి వేయండి. నాకే ఓటివ్వండి. భూకంపాల కివ్వద్దు" అని అనడం మార్కెట్లోనాల్గుకు చెల్లిందిగాని ఇంకెవరైనా అంటారా! ఇల్లా అని చప్పట్లగోలలో శాస్త్రజ్ఞుడిని ఖండిస్తూ భూకంపాలు వద్దని తీర్మానము మెజారిటీతో ప్యాస్ చేయిస్తే చెల్లిందా. కమ్యూనిస్టులు గాని, కార్మికవర్గ ఉద్యమానికి సంబంధించిన ఏమనిషీగాని హింసను, అంతర్యుద్ధాన్ని ప్రచారంచేయరు, సరిగదా వాంఛించరు కూడా. అన్ని రకాల హింసనూ, నిర్బంధాన్నీ అంతమొందించా లంటారు కమ్యూనిస్టులు.వీటిని తొలగించే టందుకు వీటికున్న ము-లక [illegible]

తొలగించడం ద్వారా సరియగు మార్గాన్ని అవలంబిస్తారు కమ్యూనిస్టులు— పోరాట పూరితమైన యీ ప్రపంచంలో యిందుకై పోరాటం సాగించాలి. కాని ఎంత కాలమైతే, కార్మికవర్గం పెట్టుబడిదారీ వర్గపు హింసకు దాసోహం చేస్తుందో, పోరాటాన్ని తప్పించుకోవడమే గాక, పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదం వ్యాపించేటందుకు సహాయభూతం అవుతుందో, అంతకాలమూ ప్రపంచములోని హింస వృద్ధి అవుతూనే ఉంటుంది." పటేల్‌గారికీ అదే సమాధానం ఇస్తున్నాను.

హింస తప్పదు అనిమైనా కమ్యూనిస్టులు సోషలిస్టులు చెప్పరు. ఏవిధమైన హింసా లేకుండా చరిత్రలో విప్లవాలు, కొన్ని సాగాయని ఒప్పుకుంటారు. 1832 లో ఇంగ్లాండులో సంస్కరణల బిల్లుద్వారా, ఆదేశపు నిరంకుశ ప్రభువుల చేతి నుండి బ్రిటిషు పెట్టుబడిదారీ వర్గానికి రాజకీయ అధికారం సంక్రమించ లేదా?

ప్రస్తుతం ప్రపంచంలో ఫాసిజం బరి మీాదబడి సాగిస్తూఉన్న హింస: ప్రపంచాన్ని యుద్ధజ్వాలలలో ముంచివేయు డానికి సామ్రాజ్య వాదుల దాహ ఫలితంగా యేర్పడ్డ యుద్ధ భయం; మొదలగు సంఘటనల ధోరణి చూస్తే వారు ప్రజలను అతి క్రూరంగా హింసించి బానిసత్వంలో ముంచి తీరుతారనియు, అట్టి సమయంలో వారి పాశాలనుండి తప్పించు

కొనుటకు కడు మెలకువగా వుండి పనిచేయ వలసిన దనియు కమ్యూనిస్టులు ప్రజలను హెచ్చరిస్తారు. ఇంతే వారు చేసేది.

కార్మికులలో సోషలిస్టు చైతన్యం హింసను తగ్గిస్తుంది.

ప్రపంచంలో కార్మిక వర్గం సాగించిన గత పోరాటాల చరిత్రను పరిశీలించి చూడండి. కార్మికులలో సోషలిస్టు చైతన్యం ఉన్న ప్రతిచోటా పారిశ్రామిక తగాదాలను వెన్నంటియే వచ్చే హింస చాలవరకు తగ్గిపోయింది. అమెరికా కార్మిక వర్గంలో అన్ని చోట్లకన్నా సోషలిస్టు చైతన్యం తక్కువ. ఆ కార్మికవర్గం హింసలో అన్నిటికన్న మొదటిది—ఇంకొకటి. ఇంతవరకూ అమెరికా కార్మికోద్యమ చరిత్రను (chequered) చిత్రవిచిత్రము గావించిన చర్యలు, ఐ. డబ్ల్యు; డి. డబ్ల్యు; వంటి అతివాద కార్మిక సంఘాలు కాదు చేసినది. రాజకీయ జ్ఞానం కించెత్తు కూడా లేని కార్మిక సంఘాల సభ్యులున్ను, అతి నిపుణులగు వృత్తి సంఘ సభ్యులగు కార్మికులున్ను గావించినవే.

బ్రిటన్‌లో గాని అమెరికాలో గాని కార్మిక వర్గానికి, సోషలిస్టు భావాలు ఉన్నాయని కూడా ఏ మాత్రము తెలియనిరోజులలో వచ్చిన సమ్మెలలో ఎన్నడూ కనివిని ఎరుగని హింస ప్రదర్శింప బడింది. ఇంగ్లాండులో 1860 ప్రాంతాలలో షెఫీ దురంతాలకు దారితీసిన పారిశ్రామిక తగాదాలూ,

1892 లో అమెరికాలో వచ్చిన హోంస్టెడ్ సమ్మెలూ ఇందుకు నిదర్శనాలు.

ఇది స్వాభావికం. "కార్మిక వర్గంలో వచ్చిన నిరాశ, అసహాయతలే హింసగా ఫలిస్తవి.

"కార్మికులు సంఘాలుగా ఏర్పడి, తమ హక్కులేమిటో, వాటినెల్లా స్థాపించుకోవాలో ఒక్కమారు తెలుసుకుంటే, ఎదుటవాళ్ళచే, హింస ప్రయోగింపబడితేనే తప్ప ముందుగా కార్మికులు హింసకు ఎన్నడూ దిగరు" అని జాన్ స్ట్రాచీగారు చెప్పినది సత్యం. సమాజంపై పెట్టుబడిదారీ వర్గం వర్గ పోరాటాన్ని రుద్దుతుంది. చుట్టు ముట్టాడిన దుర్భర పరిస్థితులలో నిస్సహాయులై, నిరాశాంధకారంలో నున్న ప్రజలకు సోషలిస్టు చైతన్యమనే దివ్యజ్యోతి లేకున్నచో యీ పోరాటంలో దారితెన్నూ దొరుకక ఆ తగాదా హింసాపూరిత తిరుగుబాటుగా పరిణమిస్తుంది. ఆగ్రహంలో తమ దుస్థితికి మూలకారణమగు విధానాన్ని గాక ప్రత్యక్షంగా కనుపిస్తూ ఉండే, యజమానులనో లేక యంత్రాలనో ఆ కార్మికులు తుదముట్టిస్తారు. సోషలిస్టు చైతన్యము గుడ్డితనాన్ని పోగొట్టి ఈ తీవ్రత నంతనూ యీ దుస్థితికి మూలకారణమైన విధానానికి వ్యతిరేకంగా సాగే పోరాటంగా మార్చి, మానవ సమాజాన్ని పునర్నిర్మాణం చేసేటందుకుపయోగించే శక్తిగా తయారు గావిస్తుంది. ఈ విధంగా గుడ్డ కోపాన్ని హింసనూ ఇది కనీసపు స్థాయికి తగ్గిస్తుంది.

గాంధీ వాదులు హింసను పరోక్షంగా బలపరుస్తూ "అహింస, సత్యాలను" వంకిలం చేస్తున్నారు.

వర్గ సామరస్యం బోధించే (అనగా కార్మిక వర్గం, పెట్టుబడిదారీ వర్గాలకు ఒకే ప్రయోజనాలున్నా యనే) గాంధీ వాదులు ప్రస్తుత సమాజంలో ఇమిడివున్న హింసను గుర్తించడానికి అంగీకరించుట లేదు. వీరంగీకరించక పోయినా పెట్టుబడిదార్లు సామ్రాజ్య వాదులూ అనుదినం సాగించే హింస, నిర్బంధమూ, పెట్టుబడిదారీ వర్గానికి కార్మిక వర్గానికి మధ్యగల తగాదాలూ ఎప్పటివలెనే వున్నాయి. పెట్టుబడిదారీ వర్గలాభాలను కాపాడవలసిన గాంధీ వాదులలో చాల మంది పీడింపబడే ప్రజా సామాన్యంపై ప్రయోగింపబడే హింసను ఆమోదింపక తప్పడంలేదు. ఇది వారిని పరస్పర విరుద్ధ స్వభావులుగా చేస్తోంది. పెట్టుబడిదారులయొక్కయు సామ్రాజ్యవాదులయొక్కయు హింసకు అడ్డు తగులగూడదు అనే అర్థమిచ్చి 'సత్యాహింసలను' కళంకితం చేస్తూ పరోక్షంగా పెట్టుబడిదారీ వర్గానికీ, సామ్రాజ్యవాదులకూ యీ విధంగా సహాయభూతు లగుచున్నారు.

"సత్యమును" ఈ బూటకం అనే ఊబిలోనుండి ఉద్ధరించి దానిని ధైర్యంతో నిశ్చలంగా సంరక్షించుట సోషలిస్టుల కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని నిరాఘాటంగా నెరవేర్చుటకు సోషలిస్టు సిద్ధాంతమే బలమయిన ఆధారం. శాంతికి సోషలిస్టు సూత్రాలకే సరిపడింది.

ఆచరణలో కూడ, జమీందార్లు, పెట్టుబడిదార్లు, సామ్రాజ్యవాదులూ తమను ఎన్ని హింసలుపెట్టి బాధిస్తూ వున్నా, వాటిని భరింపజాలని స్థితికి తాము పోయ్యేవరకూ పీడితజనసామాన్యం వాటిని సహనంతో సర్దుకొనియే పోతూంటారు. గాంధీవాదులు లగాయతు, అన్ని తరహాల జనులకూ కూడా గాంధీగారి సత్యాహింసల సిద్ధాంతమందలి లోపాన్ని గూర్చి నచ్చ చెప్పవలసిన బాధ్యత సోషలిస్టులపై నున్నది. సత్య స్థాపనకై నిశ్చలంగా ఎప్పటివలెనే పోరాడుచూ, కాంగ్రెసు ఆశయమందలి శాంతిని గూర్చియు, దానికై వలయు పోరాటాన్ని గూర్చియు ప్రజల కందరకునూ తెలియజేయాలి. నేడు ప్రపంచంలో హింస, క్రౌర్యము తాండవమాడుతూ దిన దినాభివృద్ధి నందుచున్నాయని ప్రతి కమ్యూనిస్టూ, ప్రతి గౌరవనీయుడును అంగీకరిస్తున్నారు. యూరప్ లోనూ, ఆసియాలోనూ ఫాసిజం స్వైర విహారం చేస్తోంది. భారత దేశంలో హింసకు వ్యతిరేకంగానూ, సత్యమునకు అపార్థాలు కల్పన కాకుండానూ, స్థిరంగా పోరాడుతూ జాతీయ పోరాటమందు ఐక్యతను స్థాపించి బలపరచినచో, ఫాసిస్టు దండగాలను మనం అరికట్ట గలుగుతాం.

30

తె నా లి:

గిరిజా ముద్రాలయమునందు, ముద్రింపబడింది.

మనసు ఫౌండేషన్
పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA107B160
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	55
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO.
లేని పేజీలు	NO
తయారు చేసినది	Ch. Ramya
పేజీలు విడదీసినది	Thasin
స్కాన్ చేసినది	Hema
పరీక్ష చేసినది	lakshmi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	Good